క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ ఆర్అండ్బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రాముడు బైక్‌పై కోవెలకుంట్లకు వస్తున్నాడు. కోవెలకుంట్ల వైపు నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కుందరవాగు వంతెన సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. రాముడు తీవ్రంగా గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు. ఈ మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

డోన్ : పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. 4, 5 సచివాలయాల పరిధిలో ఏడవ వార్డు కాలనీల్లో శనివారం ఆయన సచివాలయ ఉద్యోగులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వార్డులలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ తెలుసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, కౌన్సిలర్‌లు కురుకుంద పద్మావతి, కటికె వేణు, డీఈ రసూల్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా పుట్టపెద్దమ్మ బోనాల జాతర



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బేతంచెర్ల : స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసి భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న పుట్ట పెద్దమ్మ బోనాల జాతర మాఘ శుద్ధ పౌర్ణమి శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పాత కూరగాయల మార్కెట్ నుంచి బోయపేట, కొత్త బస్టాండు, పాతబస్టాండు, హనుమాన్ నగర్, సంజీవనగర్ కాలనీల మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఆలయం వరకు ఊరేగించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడలు చెల్లించుకున్నారు.

రూ. 5కోట్లతో డోన్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

డోన్ రూరల్ : డోన్ పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైల్వే స్టేషన్‌గా ఎంపిక అయిందని స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 26న ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్టేషన్‌ను ఎలా అభివృద్ధి చేయాలో తెలిపారన్నారు. డోన్ రైల్వే స్టేషన్‌లో రూ.5కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రాయానికులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగులకు లిఫ్ట్, రోడ్లు, కౌంటర్ వసతులు ఏర్పాటు చేస్తామన్నారు.

విశ్వేశ్వర స్వామి కల్యాణం

బేతంచెర్ల : మండల పరిధిలోని రహిమాన్ పురం గ్రామంలో వెలసిన కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని గ్రామ రైతు సంఘం, దాతల సహకారంతో జిల్లా స్థాయి నాలుగు పండ్లలోపు వృషభరాములకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. డోన్ మండలం కొచ్చెర్వు చిక్కడ్ బుల్స్ మొదటి స్థానంలో నిలువగా బనగనాపల్లె మండలం రాంగోపాల్ రెడ్డి వృషభాలు రెండవ, నందికొట్కూర్ మండలం, కొనిదెల గ్రామం దండు రైటర్ నరసింహులు వృషభాలు మూడవ స్థానంలో నిలిచాయి. పత్తికొండ మండలం, పందికొన లవ్ కుమార్, బేతంచెర్ల మండలం రహిమాను పురం మద్దిలేటి వృషభాలు సంయుక్తంగా నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఐదు, ఆరు స్థానాల్లో వెల్దుర్తి మండలం, శ్రీరంగాపురం బాల వినయ్, ప్యాపిలి మండలం, పీఆర్ పల్లె నాగేశ్వర యాదవ్ వృషభాలు కైవసం చేసుకున్నాయి. వృషభాల యాజమాన్యాలకు నగదు బహుమతులను అందజేశారు.

విద్యాభివృద్ధికి ప్రోత్సాహం

ప్యాపిలి: పేదల విద్యాభివృద్ధికి తమవంతు ప్రోత్సాహం ఉంటుందని, ముడియాల నారాయణరెడ్డి (ఎంఎస్ఆర్) రూరల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ అండగా ఉంటుందని నిర్వాహకులు నాగభూషణం రెడ్డి, రామమోహన్ రెడ్డి, డాక్టర్ సింధూజ, జాహ్నవి తెలిపారు. సిద్ధనగట్టు ప్రాథమిక పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులకు శనివారం బూట్లను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీలకంఠ, సొసైటీ నిర్వాహకులు నవీన్ కుమార్ రెడ్డి, రుద్రతేజ రెడ్డి, అరుణ్‌కుమార్ రెడ్డి, పోలీసు నరసింహుడు, అంజి, పాండు, సూర్యప్రకాశ్ రెడ్డి, లోకేశ్, ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి

కొలిమిగుండ్ల: మార్చి 1వ తేదీ నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండ్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాలలకు చెందిన ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. మొదటి సంవత్సరం నుంచి 136 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 99 మంది విద్యార్థులకు పరీక్షలు రాస్తున్నారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించమని, ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.



ఆకుమల్ల నుంచి బనగానపల్లె వరకు బీటీ రోడ్డు



ఆకుమల్లలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్

ఆకుమల్ల..అభివృద్ధి బాట !

- రూ. 23.58 కోట్లతో మౌలిక వసతులు
- ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో కళకళలాడుతున్న గ్రామం
- తీరిన ఏళ్లతరబడి నెలకొన్న రహదారు సమస్యలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రైతుభరోసా కేంద్రం



సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి బాట పట్టాయి. పట్టణాలు, మండల కేంద్రాలతో సమానంగా పల్లెలోనూ మౌలిక వసతులు కల్పించింది ప్రభుత్వం. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణాలను తలపిస్తున్నాయి పల్లెలు. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోని మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామ పంచాయితీకి సకల వసతులు సమకూరాయి. ఈ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం రూ. 23.58 కోట్లు ఖర్చు చేసింది. గ్రామ పంచాయితీ పరిధిలో 950 కుటుంబాలు ఉండగా దాదాపు 4,500 మంది జనాభా ఉన్నారు. గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, మినరల్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు మెరుస్తున్నాయి. బస్టాండ్ నుంచి బోయ కాలనీ వరకు, ప్రాథమికి హెల్త్ సెంటర్ సమీప రోడ్డు ఏర్పాటు చేయడంతో ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్య తీరింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. ఆకుమల్ల అన్నివిధాలుగా అభివృద్ధి చెందడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రూ. 9 కోట్లతో బనగానపల్లెకు బీటీ రోడ్డు

రూ. 9 కోట్లలో నిర్మించిన ఆకుమల్ల-బనగానపల్లె డైరెక్ట్ రోడ్డు కళకళలాడుతుంది. ఆకుమల్ల నుంచి శివవరం మీదుగా బనగానపల్లెకు రోడ్డు ఉందని వినడం తప్పా చూసింది లేదు. అంత అధ్వానంగా ఉండేదా రోడ్డు. దీంతో ఆకుమల్ల సమీప గ్రామాలు బనగానపల్లెకు అవుకు మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి. పది కిలోమీటర్లకుపైగా చుట్టు తిరిగి బనగానపల్లెకు వెళ్తున్నారు ఆయా గ్రామాల ప్రజలు. ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తవ్వడంతో రాకపోకలు సులువయ్యాయి. సమయంతోపాటు డబ్బు ఆదా అవుతుంది. అదే విధంగా ఆకుమల్ల- సుంకేసుల రోడ్డు నిర్మించడంతో ఏళ్లతరబడి నెలకొన్న రహదారుల సమస్యలు తీరాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనులు

- రూ.40 లక్షలతో నూతన గ్రామ సచివాలయ భవన నిర్మాణం
- రూ.22 లక్షలతో రైతుభరోసా కేంద్రం
- రూ.5లక్షలతో నూతన మినరల్ వాటర్ ప్లాంట్



గ్రామ సచివాలయం భవనం

- రూ.30 లక్షలతో వివిధ కాలనీలలో సీసీ రోడ్లు
- జల్‌జీవన్ మిషన్ నిధులతో రూ.70 లక్షలతో పైపులైన్ నిర్మాణం
- ఉన్నత పాఠశాలలో నాడు నేడు కింద రూ.1.40 కోట్లతో అభివృద్ధి
- రూ.9 కోట్లతో ఆకుమల్ల నుంచి బనగానపల్లె వరకు బీటీ రోడ్డు
- రూ.1.76 కోట్లతో ఆకుమల్ల నుంచి సుంకేసుల వరకు బీటీ రోడ్డు

గ్రామంలోనే అన్ని సేవలు



ప్రభుత్వ సేవలు అన్ని స్వగ్రామంలోనే అందుతున్నాయి. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో మేము ఇళ్లు మంజూరు చేయాలని మండల కార్యాలయాల చుట్టు తిరిగినా ఫలితం లేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలో ఉన్న సచివాలయంలో ఇంటి పట్టా, గృహం కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం వెంటనే మంజూరు చేసింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–సద్దాం హుస్సేన్, ఆకుమల్ల గ్రామం

గతంలో కంటే ప్రస్తుతం అభివృద్ధి మిన్న



గత టీడీపీ ప్రభుత్వంలో ఏ మాత్రం ఆకుమల్ల గ్రామం అభివృద్ధి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువతో నిధుల మంజూరు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసికెళ్లిన ప్రతి సమస్యకు పరిష్కారం అవుతుంది. గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి చెందింది. ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం.

– గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్, ఆకుమల్ల

గ్రామంలో సమస్యలు తీరాయి...



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరువతో గ్రామంలో నెలకొన్న సమస్యలు దాదాపు తీరాయి. గత ప్రభుత్వం అభివృద్ధి గాలికి వదిలేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలం, రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో సేవలు మరింత చేరువయ్యాయి. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాలలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయి.

– గౌరిగారి కిరణ్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, ఆకుమల్ల

ఎమ్మెల్యే కాటసానిని కలిసిన అసిస్టెంట్ కమిషనర్



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న కామేశ్వరి

బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చెపట్టిన కామేశ్వరి శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని బనగానపల్లెలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి పుష్పగుచ్ఛంతో పాటు అమ్మవారి ప్రసాదం అంద జేశారు. గతంలో కార్యనిర్వాహణాధికారి స్థాయి కలిగిన ఈ ఆలయం అసిస్టెంట్ కమిషన్ స్థాయికి పెంచడంతో కామేశ్వరిని ప్రభుత్వం నియమించింది. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని చిన్నమల్కాపురం గ్రామ సబ్ స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నేపథ్యంలో ఆదివారం మల్కాపురం, రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, ఫ్యాక్టరీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 6గంటల వరకు కరెంటు ఉండదన్నారు. వ్యవసాయానికి సంబంధించి త్రీ ఫేస్ కరెంటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. అలాగే పట్టణంలోని సబ్ స్టేషన్‌లో అదనపు బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున అబ్బిరెడ్డిపల్లె, వెంకటాపురం, బొంతిరాళ్ల, గుమ్మకొండ గ్రామాల రైతుల వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా చేస్తామని వివరించారు.

కోలుకోలేక వృద్ధురాలి మృతి

డోన్ టౌన్ : కాలిన గాయాలతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం యు.కొత్తపల్లె గ్రామానికి చెందిన వృద్ధురాలు గొల్ల బజారమ్మ మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతురాలు గ్రామంలో నివాసం ఉన్న తన మూడవ కుమారుడైన గొల్ల సుబ్బరాయుడితో కలిసి ఉంటోంది. ఈ నెల 20న కుమారుడు, కోడలు కర్నూలు సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మ వద్ద చేస్తున్న దైవ కార్యక్రమానికి వెళ్లారు. వంట చేసుకుంటుండగా బజారమ్మ చీరకు నిప్పు అంటుకుని గాయాలు అయ్యాయి. ఇంటి ప్రక్కలవారు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు కుమారుడు గొల్ల సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

బనగానపల్లె రూరల్ : కొలిమిగుండ్ల మండలం, నాయునిపల్లె గ్రామానికి చెందిన దస్తగిరికి మంజూరైన రూ.2లక్షల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అందజేశారు. బనగానపల్లెలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ దస్తగిరికి చెందిన ఇళ్లు రెండు నెలల క్రితం విద్యుత్ షాక్ గురై ఎక్కువ ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తమ దృష్టికి తీసుకురావడంతో సీఎం సహాయ నిధి కింద ప్రభుత్వం ద్వారా రూ.2లక్షలు మంజూరు చేయించామన్నారు.

సమయపాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

అవుకు: మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ అన్నారెడ్డి మల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం అవుకు-2 సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించాలనే ఉద్దేశంతో గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. ఉద్యోగులు నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. అలాగే సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి సచివాలయ పరిధిలోని ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య శ్రీ కార్డులను ఎంపీడీఓ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం దానమ్మ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

డోన్ టౌన్ : మార్చి 9వ తేదిన జరిగే మోగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి న్యాయవాదులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. స్థానిక ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి హాల్‌లో శనివారం లోక్ అదాలత్‌పై న్యాయమూర్తులు ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అల్లా బకాష్‌తో కలిసి డోన్ బార్ కౌన్సిల్ న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షణికావేశంలో గోడవలకు దిగి కేసుల వరకు పోయిన పరిస్థితుల గురించి కక్షిదారుల వివరించాలన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా సమయం ఆదా అవ్వడంతో పాటు సత్వర న్యాయం లభిస్తుందన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బార్ కౌన్సిల్ అధక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి శేషశయనరావు, కోశాధికారి శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్‌గౌడ్, రాగులరాముడు, గోపాల్‌రెడ్డి, యోగానందరెడ్డి, మహ్మద్‌అలీ, కుమారి తదితరులు పాల్గొన్నారు.





గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు

రూ. 41 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్ : మండలంలోని యనకండ్ల గ్రామంలో రూ. 41 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు పూర్తయ్యాయి. ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలు, మెయిన్ బజారులో రూ.31లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరు రామచంద్రారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు వలంటీర్లు గృహసారథులు, బూత్ కన్వీనర్లు హాజరుకావాలని ఆయన పిలుపు నిచ్చారు.

- డోన్ టీడీపీ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డి స్థానంలో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి
- ప్రకటించిన చంద్రబాబు
- మరోమారు బట్టబయలైన బాబు నైజం

బాబంతే... బాబంతే !

డోన్ : తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు తన నైజాన్ని మరోమారు చాటుకున్నాడు. అవసరాలకు వాడుకోవడం...అవసరం తీరాక సింపుల్‌గా కట్ చేయడం తనకు వెన్నతోపెట్టిన విద్య అని నిరూపించాడు బాబు. రెండేళ్ల క్రితం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేసేందుకు కోట్ల, కేఈ వర్గాలు ముందుకు రాకపోవడంతో ధర్మవరం సుబ్బారెడ్డికి చంద్రబాబునాయుడు బాధ్యతలు అప్పగించారు. చంద్రబాబు మాయమాలకు ఉప్పొంగిన ధర్మవరం సుబ్బారెడ్డి ఏదో ఒక పార్టీ కార్యక్రమాన్ని చేపడుతూ రూ. కోట్లు సొంత డబ్బును ఖర్చు చేశారు. స్థాయికి మించి వైఎస్సార్‌సీపీని విమర్శించాడు కూడా. చంద్రబాబు ఒక్కసారిగా మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని డోన్ అభ్యర్థిగా ప్రకటించడంతో సుబ్బారెడ్డి అయోమయంలో పడ్డాడు. ఆయన అనుచరుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. మరోవైపు కోట్ల, కేఈ వర్గీయులు సంబరాలు చేసుకున్నారు. దీంతో సోషల్‌మీడియా వేదికగా చంద్రబాబు తీరుపై ధర్మవరం వర్గీయులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. బాబంతే... బాబంతే అంటూ ఎద్దేవా చేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు.

కోట్ల, కేఈ వర్గీయులు కలుస్తారా?

డోన్ నియోజకవర్గంలో యాభైఏళ్లుగా ఫ్యాక్షన్ రాజకీయాలు నడిపి అనేకమంది మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన కోట్ల, కేఈ వర్గాలు ఏకం కావడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. అనాదిగా పరస్పరం కత్తులు దూసుకున్న వైరి వర్గాలు నేడు కౌగిలించుకొని అమాయకులను బలిపశువులను చేశారని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. కేఈ, కోట్ల కుటుంబాలు ప్రజావ్యతిరేకతను కూడగట్టుకున్నారనే వార్తలు వస్తున్నాయి. కోట్ల, కేఈ ఒక్కటే అయినా వర్గీయులు విషయం ఎలా ఉంటుందనేది ప్రశ్నార్థకం. వారి వర్గపోరు మంత్రి బుగ్గనకు కలిసొస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండున్నరేళ్లు కరోనా కష్టకాలం ఎదురవ్వగా, మిగిలిన రెండున్నరేళ్లలో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే కాక నియోజకవర్గంలో రూ.3వేల కోట్లతో మంత్రి బుగ్గన చేపట్టిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. టీడీపీ అభ్యర్థి ఎవరైనా బుగ్గన విజయం తథ్యమంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

గురితప్పిన బుల్లెట్ ...

ఏడాది క్రితం నియోజకవర్గంలో పర్యటించిన చంద్రబాబు బహిరంగ సభల్లో బుగ్గన కాచుకో నీపై బుల్లెట్‌ను వదిలాను, ఈ బుల్లెట్‌కు తిరుగులేదు, సరైన మొనగాడు అంటూ సుబ్బారెడ్డిని కీర్తిస్తూ రాష్ట్రంలోనే మొదటి టీడీపీ అభ్యర్థిగా ఆయనను ప్రకటించారు. రెండేళ్లు పార్టీకి ఊడిగం చేయించుకొని నేడు తడిగుడ్డతో నమ్మించి గొంతు కోశాడని.. కొందరు... బుల్లెట్ గురి తప్పిందని మరి కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. అదేవిధంగా ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ వీడి టీడీపీ గూటికి ధర్మవరం చేరిన సందర్భంగా అప్పటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ఆయన సోదరులు కేఈ ప్రభాకర్, కేఈ ప్రతాప్‌లు డోన్‌లో తమకు వజ్రం లాంటి సుబ్బారెడ్డి అనుచరుడుగా లభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. డోన్ నుండి రెండుసార్లు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కేఈ ప్రతాప్ స్థానంలో ఇన్‌చార్జీగా సుబ్బారెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కేఈ కుటుంబీకులు అడ్డంకిగా మారారు.

పొదుపు గ్రూపు లీడర్‌పై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని రాఘవరాజుపల్లె గ్రామానికి చెందిన పొదుపు గ్రూపు లీడర్ శ్రీలతపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు శనివారం తెలిపారు. పొదుపు గ్రూపుకు సంబంధించిన డబ్బులను శ్రీలత సొంతంగా వాడుకుంటుందని అదే గ్రూ పులోని సభ్యురాలు గొంగటి విజయలక్ష్మి ఆరోపిస్తుండేది. ఊర్లో అందరికి డబ్బులు వాడుకుందని చెబుతుందనే ఉద్దేశంతో విజయలక్ష్మితో పాటు ఆమె ఇద్దరు తమ్ముళ్లు రామమోహన్‌రెడ్డి,రామకృష్ణారెడ్డిపై దాడికి పాల్పడటంతో గాయపడ్డారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.

ఘనంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామ మందిరంలో మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం సీతారామ, లక్ష్మణ సహిత హనుమద్విగ్రహ, దీప ధ్వజస్తంభ, విమాన కలశ ప్రతిష్ట, కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. భక్త జనసందోహం, శ్రీరామ నామస్మరణల మధ్య స్వామివారి విగ్రహ ప్రతిష్ట కనుల పండువగా నిర్వహించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ తిరుమలేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, బీరవోలు నాగేశ్వర్‌రెడ్డి, గూని నాగరాజు, సీతారామాపురం, గోరుమాను కొండ సర్పంచ్‌లు చిట్టి వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, గ్రామస్తులు జయ ప్రకాశ్ రెడ్డి, రమణారెడ్డి, శేషిరెడ్డి, రామ చంద్రుడు, నాగరాజు, తిమ్మయ్య పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి



డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న చైర్మన్, కమిషనర్

డోన్ టౌన్ : పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేచేసి కసే గాజులదిన్నె ప్రాజెక్టు పైపులైన్‌ను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ డాక్టర్ జయరాం వినతి పత్రం అందజేశారు. పైపులైన్‌ను తరచుగా గోర్రెల, పశుల కాపరులు, గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేస్తున్నారని వారు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యల కారణంగా పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం కృష్ణగిరి మండలం సంగాల గ్రామం వద్ద పైపు లైనుకు మరమత్తులు చేశామన్నారు. కార్యక్రమంలో డీఈ రసూల్,ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.